RNI: APTEL/2010/36742



# న్యూస్ వార్
## వార్తా పత్రిక

విలేకరులు కావలెను
తెలుగు భాషపై పట్టు స్థానిక సమస్యలపై అవగాహన కలిగిన ఉత్సాహవంతులైన
యువతి యువకులకు జర్నలిస్ట్‌గా పనిచేసేందుకు సదావకాశం
న్యూస్ వార్ దిన పత్రిక
నూతన ఒరవడి ప్రత్యేక కథనాలతో మీ ముందుకు వస్తున్న న్యూస్‌వార్ దిన పత్రికలో
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు,నియోజకవర్గాలు, మండల కేంద్రాలల్లో
వార్తాసేకరణకు విలేకరులు కావలెను ఆసక్తి కలవారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించండి.
94409 91979

నల్లగొండ | epaper.news war.com | ఆదివారం 17, మే 2026 | సంపుటి :16 సంచిక :51 | ఎడిటర్: కృష్ణారావు నటవ | పేజీలు : 4 , వెల.2.00



### తైవాన్ కోసం చైనాతో

# యుద్ధం చేయలేం: ట్రంప్

పేజీ 2లో

తైవాన్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యూటర్న్ తీసుకున్నారు. తైవాన్ స్వాతంత్ర్యం కోసం చైనాతో పోరాడడం కుదరదని తేల్చి చెప్పేశారు. ఇటీవల చైనా పర్యటన ముగించుకుని తిరిగి అమెరికా చేరుకున్న ట్రంప్ ఓ వార్తా సంస్థతో మాట్లాడారు. తైవాన్‌కు చైనా కేవలం 95 కిలో మీటర్ల దూరంలో ఉందని, అమెరికా 15 వేల కి.మీ. దూరంలో ఉందని వ్యాఖ్యానించారు .'ఉద్రిక్తతల విషయంలో చైనా, తైవాన్ సంయమనం పాటించాలి. తైవాన్‌కు అమెరికా చాలా దూరంలో ఉంది.

### కోట్లాది మంది భారతీయుల

# నమ్మకం నన్ను అలసిపోనివ్వదు

- దేశంలో ప్రస్తుతం నెలకు 20 బిలియన్ డాలర్ల డిజిటల్ ట్రాన్సాక్షన్లు
- భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే
- సెమీకండక్టర్ల అంశంలోనూ భారత్ ముందడుగు
- భారత స్నేహానికి ది హేగ్ సజీవ చిహ్నం
- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

2లో



**భారతదేశం అభివృద్ధిలో దూసుకెళ్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. దేశంలో ప్రస్తుతం నెలకు 20 బిలియన్ డాలర్ల డిజిటల్ ట్రాన్సాక్షన్లు జరుగుతున్నాయని తెలిపారు. భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే ఉండేవని.. ప్రస్తుతం అవి 100కు చేరాయన్నారు.** సెమీకండక్టర్ల అం శంలోనూ భారత్ ముందడుగు వేసిందని.. ఆ దిశగా పనులు కూడా జరుగుతున్నాయని పేర్కొన్నారు. నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ.. ది హేగ్ నగరంలో ప్రవాస భారతీయులను కలిశారు. వారితో మాటామంతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐలపై ప్రశంసలు కురిపించారు. లక్ష్యాలను అధిగమించి వారు పని చేస్తున్నారని కొనియాడారు.

### తెలంగాణలో జూన్ 25 నుంచి

# సర్ ప్రారంభం: సుదర్శన్ రెడ్డి

దేశ వ్యాప్తంగా సర్ ప్రక్రియ ప్రారంభమైందని.. తెలంగాణలో జూన్ 25 నుంచి ఈ ప్రక్రియ మొదలవుతుందని సీఈవో సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఇంటింటికీ వెళ్లి బీఎల్‌వో(దీూ)లు ప్రత్యేక సర్వే చేస్తారని అన్నారు. ప్రతి ఓటరుకూ ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తారని.. ప్రతి ఇంటినీ కనీసం మూడు సార్లు బీఎల్‌వో సందర్శిస్తారని చెప్పారు. కొత్త ఓటర్ల వివరాలను ఫారం-6లో ప్రత్యేకంగా నమోదు చేస్తారన్నారు. వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ ఎన్యుమరేషన్ అవకాశం ఉందని తెలిపారు. హెల్ప్‌లైన్ 1950తో పాటు సదుపాయం కల్పించినట్లు చెప్పారు.ఎన్యుమరేషన్ దశలో ఫారం తప్ప అదనపు పత్రాలు అవసరం లేదని సీఈవో తెలిపారు.

2





# కేటుగాళ్లతో జాగ్రత్త..

2

### సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్ నేపథ్యంలో సజ్జనార్ హెచ్చరిక


### బండి సంజయ్‌ను

# బర్తరఫ్ చేయండి.. ప్రధానికి కవిత లేఖ



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగించాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కె. కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె ప్రధాని మోదీకి ఒక లేఖ రాశారు.'

వార్త 2లో




# పాక్ తీరు మారకుంటే.. చరిత్రలో కలిసిపోతుంది

- దేశ భద్రత విషయంలో భారత్ ఎలాంటి రాజీకీ వెళ్లదు
- అవసరమైతే కఠిన చర్యలు తీసుకునేందుకు భారత సైన్యం సిద్ధం
- అందరిపై కఠిన చర్యలు తీసుకుంటుంది
- ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది

2 లో..

# నీట్ పేపర్ లీకేజీ కేసులో మరో కీలక సూత్రధారి అరెస్ట్

**న్యూఢిల్లీ:** నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం దేశమంతా సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసులో మరో కీలక సూత్రధారి అరెస్టయ్యారు. ఢిల్లీలో విచారణ అనంతరం పుణెకు చెందిన బోటనీ టీచర్ మనీషా గురునాథ్ మందరేను సిబిఐ అధికారులు అరెస్ట్ చేశారు. ఆమె నీట్-యుజి బయోలజీ పేపర్‌ను లీక్ చేసినట్లు దర్యాప్తు సంస్థ గుర్తించింది.



2

# క్రెడిట్ కార్డు ఇస్తామని మోసాలు.. సైబర్ నేరగాళ్ల అరెస్ట్

2

### మరోసారి పెట్రోల్ ధర పెంపు?

# రూ.10 వరకూ పెంచే ఛాన్స్..

దేశంలో మరోసారి పెట్రోల్, డీజిల్ ధరలు పెంచకతప్పదా? అంటే అవుననే అంటున్నారు ఆర్థికవేత్తలు. ఆయిల్ మార్కెటింగ్ సంస్థల నష్టాలను తగ్గించేందుకు ధరలను మరో రూ.10ల మేర పెంచాల్సి రావొచ్చని అంటున్నారు. ఈ మేరకు ఆర్థిక సేవల సంస్థ ఎమ్‌కే గ్లోబల్ ఒక నివేదికను విడుదల చేసింది.



# తైవాన్ కోసం చైనాతో యుద్ధం చేయలేం: ట్రంప్

తైవాన్ న్యూస్‌వార్ ప్రతినిధి

విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యూటర్న్ తీసుకున్నారు. తైవాన్ స్వాతంత్ర్యం కోసం చైనాతో పోరాడడం కుదరదని తేల్చి చెప్పేశారు. ఇటీవల చైనా పర్యటన ముగించుకుని తిరిగి అమెరికా చేరుకున్న ట్రంప్ ఓ వార్తా సంస్థతో మాట్లాడారు. తైవాన్‌కు చైనా కేవలం 95 కిలో మీటర్ల దూరంలో ఉందని, అమెరికా 15 వేల కి.మీ. దూరంలో ఉందని వ్యాఖ్యానించారు.'ఉద్రిక్తతల విషయంలో చైనా, తైవాన్ సంయమనం పాటించాలి. తైవాన్‌కు అమెరికా చాలా దూరంలో ఉంది. ఏదైనా జరిగితే మేం వేగంగా స్పందించడం కష్టమే. పైగా, చైనా చాలా శక్తిమంతమైన, పెద్ద దేశం. తైవాన్ కోసం చైనాతో యుద్ధం చేయాలనుకోవడం లేదు' అని ట్రంప్ తేల్చి చెప్పారు. అలాగే తైవాన్‌కు ఇవ్వాల్సిన 14 బిలియన్ డాలర్ల ఆయుధాల ప్యాకేజీపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని ట్రంప్ తెలిపారు (ఖా జష్ట్రఅఖు ఖుఅఖుఅ అంంబవ).తైవాన్‌ను తనలో పూర్తిగా విలీనం చేసుకోవాలని చైనా ఎప్పట్నుంచో ప్రయత్నిస్తోంది. ఆ ప్రయత్నాలను అమెరికా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ట్రంప్ కూడా చైనా తీరుపై విమర్శలు గుప్పించారు. అయితే తాజా పర్యటన తర్వాత ట్రంప్ వైఖరిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. కాగా, అమెరికా-చైనా సంబంధాల్లో తైవాన్ అత్యంత కీలక అంశమని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తనతో అన్నారని ట్రంప్ వెల్లడించారు. 'మేము రాత్రంతా తైవాన్ గురించే మాట్లాడాం' అని తెలిపారు.

# పాక్ తీరు మారకుంటే.. చరిత్రలో కలిసిపోతుంది

దేశ భద్రత విషయంలో భారత్ ఎలాంటి రాజీకీ వెళ్లదు

అవసరమైతే కఠిన చర్యలు తీసుకునేందుకు భారత సైన్యం సిద్ధం

ఉగ్రవాదులను, వారి మద్దతుదారులను

భారత్ ఒకే విధంగా పరిగణిస్తుంది

అందరిపై కఠిన చర్యలు తీసుకుంటుంది

ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది

ఢిల్లీ: న్యూస్‌వార్ ప్రతినిధి

ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తూ భారత్‌పై దాడులు కొనసాగిస్తే ప్రపంచపటంలో పాకిస్థాన్ అస్తిత్వమే ప్రమాదంలో పడుతుందని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరించారు. భౌగోళికంగా ఉండాలా లేక చరిత్రలో కలిసిపోవాలా అనేది పాకిస్థాన్ తేల్చుకోవాలని వార్నింగ్ ఇచ్చారు. భారత్‌పై దాడులు చేసే ఉగ్రవాద సంస్థలకు మద్దతు ఇవ్వడం ఆపాలని ఆయన పాక్‌ను హెచ్చరించారు. దేశ భద్రత విషయంలో భారత్ ఎలాంటి రాజీకీ వెళ్లదని, అవసరమైతే కఠిన చర్యలు తీసుకునేందుకు భారత సైన్యం సిద్ధంగా ఉందని ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు. ఉగ్రవాదులను, వారి మద్దతుదారులను భారత్ ఒకే విధంగా పరిగణిస్తుందని, అందరిపై కఠిన చర్యలు తీసుకుంటుందని పునరుద్ఘాటించారు. అలాగే గతేడాది పహల్గాం దాడికి ప్రతిస్పందనగా నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' గురించి కూడా ద్వివేది మాట్లాడారు.'పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాల ఉనికిని 'ఆపరేషన్ సిందూర్' ద్వారా ప్రపంచానికి తెలియజేశాం. ఉగ్ర స్థావరాలకు సంబంధించిన ఆధారాలు అందజేశాం (రాజూవతీఖ్‌అశీఅ రాఅఅసశీశీతీ). పాకిస్థాన్ ఇప్పటికైనా తన తీరు మార్చుకోవాలి. ఆపరేషన్ సిందూర్ రెండో వెర్షన్ మరింత తీవ్ర స్థాయిలో ఉంటుంది. భారత ప్రభుత్వం ఎప్పుడూ దేశ పౌరుల రక్షణ, శ్రేయస్సు విషయంలో రాజీ పడదు. తన మార్గంలో ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే దీటుగా స్పందిస్తుంది' అని ద్వివేది తేల్చి చెప్పారు.

# తెలంగాణలో జూన్ 25 నుంచి సర్ ప్రారంభం: సుదర్శన్ రెడ్డి

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

దేశ వ్యాప్తంగా సర్ ప్రక్రియ ప్రారంభమైందని.. తెలంగాణలో జూన్ 25 నుంచి ఈ ప్రక్రియ మొదలవుతుందని సీఈవో సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఇంటింటికీ వెళ్లి బీఎల్‌వో(దీూా)లు ప్రత్యేక సర్వే చేస్తారని అన్నారు. ప్రతి ఓటరుకూ ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తారని.. ప్రతి ఇంటినీ కనీసం మూడు సార్లు బీఎల్‌వో సందర్శిస్తారని చెప్పారు. కొత్త ఓటర్ల వివరాలను ఫారం-6లో ప్రత్యేకంగా నమోదు చేస్తారన్నారు. వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ ఎన్యుమరేషన్ అవకాశం ఉందని తెలిపారు. హెల్ప్‌లైన్ 1950తో పాటు సదుపాయం కల్పించినట్లు చెప్పారు. ఎన్యుమరేషన్ దశలో ఫారం తప్ప అదనపు పత్రాలు అవసరం లేదని సీఈవో తెలిపారు. ఫారం ఇచ్చిన వారందరి పేర్లు డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో చేర్చుతారని, ఫారం ఇవ్వని ఓటర్ల జాబితా బూత్ వారీగా ప్రదర్శిస్తారని తెలిపారు. డ్రాఫ్ట్ రోల్స్ తర్వాత అభ్యంతరాలను స్వీకరిస్తామని చెప్పారు. పుట్టిన తేదీ ఆధారంగా పత్రాల సమర్పణకు నిబంధనలు వర్తిస్తాయన్నారు. 1987 జూలై 1కు ముందు పుట్టిన వారికి ఒకే పత్రం సరిపోతుందని.. 1987 - 2004 మధ్య పుట్టిన వారికి తల్లిదండ్రుల వివరాలు కూడా తప్పనిసరి అని చెప్పారు. 2004 తర్వాత జన్మించిన వారికి తల్లిదండ్రుల పత్రాలు తప్పనిసరన్నారు.2002లో రాష్ట్రంలో చేశారని సీఈవో తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలన్నదే ఎస్ఐఆర్ ఉద్దేశమన్నారు. రాష్ట్రంలో 3.45 కోట్ల ఓటర్లు, 35 వేల పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. పొలిటికల్ పార్టీలకు కూడా సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎన్యుమరేషన్ తర్వాత డ్రాఫ్ట్ విడుదల చేస్తామని.. అందులో చూసుకొని ఓటర్లు మార్పు, చేర్పులు చేసుకోవచ్చని సీఈవో సుందర్శన్ రెడ్డి వెల్లడించారు.

# కేటుగాళ్లతో జాగ్రత్త.. సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్ నేపథ్యంలో సజ్జనార్ హెచ్చరిక

హైదరాబాద్: న్యూస్‌వార్ ప్రతినిధి

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో భాగంగా మే 22న సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య మ్యాచ్ జరుగనుంది. ఉప్పల్ వేదికగా జరిగే చివరి మ్యాచ్ కావడంతో ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు అభిమానులు పెద్ద ఎత్తున ఆసక్తి చూపిస్తున్నారు. దీన్ని సైబర్ కేటుగాళు తమకు అనుకూలంగా మార్చుకొనే అవకాశం ఉందని సిపి సజ్జనార్ ఫ్యాన్స్‌ని హెచ్చరించారు. సోషల్‌మీడియా వేదికగా ఐపిఎల్ టికెట్ల బుకింగ్‌కు సంబంధించి అనేక ప్రకటనలు దర్శనమిస్తాయని సజ్జనార్ తెలిపారు. అధికారిక టికెటింగ్ భాగస్వామి అయిన 'డిస్ట్రిక్' యాప్‌ను పోలిన రంగులు, లోగోలతో ఉన్న నకిలీ యాప్‌లను సృష్టించి తక్కువ ధరకే టికెట్లు ఇస్తామంటూ ఊరిస్తున్నారు. ఫేక్ యాప్స్‌తో తస్మాత్ జాగ్రత్త. మ్యాచ్ చూడాలనే ఉత్సాహంతో సోషల్‌మీడియాలో వచ్చే అనధికార లింకులను నమ్మి మోసపోవద్దు. ఇలాంటి ఫేక్ యాప్స్, వెబ్‌సైట్లపై నిఘా ఉంచాం. ఎవరికైనా ఇలాంటి యాప్స్, వెబ్‌సైట్ల గురించి తెలిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి" అని ఎక్స్‌లో సజ్జనార్ పోస్ట్ చేశారు.

# కోట్లాది మంది భారతీయుల నమ్మకం నన్ను అలసిపోనివ్వదు

దేశంలో ప్రస్తుతం నెలకు 20 బిలియన్ డాలర్ల డిజిటల్ ట్రాన్సాక్షన్లు

భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే

సెమీకండక్టర్ల అంశంలోనూ భారత్ ముందడుగు

భారత స్నేహానికి ది హేగ్ సజీవ చిహ్నం

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

ఢిల్లీ: న్యూస్‌వార్ ప్రతినిధి





భారతదేశం అభివృద్ధిలో దూసుకెళ్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నా రు. డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉందని చెప్పా రు. దేశంలో ప్రస్తుతం నెలకు 20 బిలియన్ డాలర్ల డిజిటల్ ట్రాన్సాక్షన్లు జరుగుతున్నాయని తెలిపారు. భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే ఉండేవని.. ప్రస్తుతం అవి 100కు చేరాయన్నారు. సెమీకండక్టర్ల అం శంలోనూ భారత్ ముందడుగు వేసిందని.. ఆ దిశగా పనులు కూడా జరుగుతున్నాయని పేర్కొన్నారు. నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ.. ది హేగ్ నగరంలో ప్రవాస భారతీయులను కలిశారు. వారితో మాటామంతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐలపై ప్రశంసలు కురిపించారు. లక్ష్యాలను అధిగమించి వారు పని చేస్తున్నారని కొనియాడారు.ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. 'ఇంతటి ప్రేమ, ఉత్సాహాన్ని చూసి నెదర్లాండ్స్‌లో ఉన్నానన్న సంగతి ఒక్క క్షణం మర్చిపోయాను. భారతదేశంలోనే ఓ ఉత్సవానికి హాజరైనట్లు అనిపించింది. భారత స్నేహానికి ది హేగ్ సజీవ చిహ్నంగా మారిందని అనిపిస్తోంది. నేను నెదర్లాండ్స్ నాయకత్వంతో మాట్లాడిన ప్రతిసారీ వారు ప్రవాస భారతీయులను ప్రశంసిస్తూనే ఉంటారు. నెదర్లాండ్స్ సమాజానికి, ఆర్థిక వ్యవస్థకు మీరు చేసిన సేవకు ప్రతి భారతీయుడు గర్వపడుతున్నాడు. మీ పూర్వీకులు ఇక్కడికి వచ్చినప్పుడు ఎన్నో విషయాలను వదిలేశారు. కానీ కొన్ని విషయాలు ఎల్లప్పుడూ మీతోనే ఉండిపోయాయి. భారతదేశ మట్టి పరిమళం, పండుగల జ్ఞాపకాలు, భక్తి గీతాల రాగాలు, పూర్వీకులు అందించిన విలువలు మీతో ఉన్నాయి.

# బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయండి..ప్రధానికి కవిత లేఖ

హైదరాబాద్: న్యూస్‌వార్ ప్రతినిధి

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగించాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కె. కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె ప్రధాని మోదీకి ఒక లేఖ రాశారు."కేంద్ర మంత్రివర్గ కూర్పుకు సంబంధించిన చట్టపరమైన నైతికత, ప్రజా విశ్వాసం వంటి కీలక అంశాలను మీ దృష్టికి తీసుకువచ్చేందుకే ఈ లేఖ రాస్తున్నాను" అని కవిత ప్రధానిని ఉద్దేశించి పేర్కొన్నారు. చట్టాన్ని అమలు చేసే యంత్రాంగాలపై అధికారం కలిగిన హోం శాఖ వంటి అత్యంత కీలకమైన శాఖలో బండి సంజయ్ కొనసాగడం వల్ల కేసు దర్యాప్తు ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, డిసెంబర్ 31, 2025న మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో ఘటన జరిగినట్లు ఆరోపణలున్నాయి. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం .... జూన్ 2025 నుంచి భగీరథ్, బాలికను గ్రూమింగ్ చేసి, మద్యం తాగించి లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి. మొదట ఐపీసీ సెక్షన్లు 74, 75తో పాటు పోక్సో సెక్షన్లు 11/12 కింద కేసు నమోదై, తర్వాత బాలిక స్టేట్‌మెంట్ ఆధారంగా అగ్రవేటెడ్ పెనిట్రేటివ్ అసాల్ట్ (గూజూూ సెక్షన్ 5(శ్రీ) తీ/ష 6) కింద అప్‌గ్రేడ్ చేశారు.

# మరోసారి పెట్రోల్ ధర పెంపు? రూ.10 వరకూ పెంచే ఛాన్స్..

ఇంటర్నెట్ డెస్క్: న్యూస్‌వార్ ప్రతినిధి

దేశంలో మరోసారి పెట్రోల్, డీజిల్ ధరలు పెంచకతప్పదా? అంటే అవుననే అంటున్నారు ఆర్థికవేత్తలు. ఆయిల్ మార్కెటింగ్ సంస్థల నష్టాలను తగ్గించేందుకు ధరలను మరో రూ.10ల మేర పెంచాల్సి రావొచ్చని అంటున్నారు. ఈ మేరకు ఆర్థిక సేవల సంస్థ ఎమ్‌కే గ్లోబల్ ఒక నివేదికను విడుదల చేసింది.పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగుతున్నాయి. ఫలితంగా దేశీయంగా కూడా ధరలు పెంచకపోతే ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల నష్టాలు మరింత పెరుగుతాయని ఎమ్‌కే గ్లోబల్ సంస్థ పేర్కొంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను సగటున రూ.3 మేర పెంచింది. అంతకుముందే ప్రభుత్వం ఇంధనాలపై ఎక్సైజ్ డ్యూటీలో లీటరుకు రూ.10ల మేర కోత పెట్టింది. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల నష్టాలను సగానికైనా తగ్గించుకునేందుకు వచ్చే రెండు మూడు వారాల్లో ధరలను లీటరుకు రూ.10 చొప్పున పెంచే అవకాశం ఉందని అంచనా




వేసింది. ఒక్కసారిగా లేక విడతల వారీగా ఇంధన ధరలు రాబోయే రోజుల్లో పెరగవచ్చని తన నివేదికలో అంచనా వేసింది.అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడి చమురు ధర 10 డాలర్ల మేర పెరిగితే దేశంలో ద్రవ్యోల్బణం 0.3 శాతం మేర పెరుగుతుందని కొందరు ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు. కరెంట్ అకౌంట్ లోటు కూడా 0.3 శాతం మేర పెరుగుతుందని అంటున్నారు. ముడి చమురు ధరల్లో పెరుగుదల కారణంగా ఇప్పటికే జీడీపీ కుదింపునకు సంబంధించిన అంచనాలు కూడా వెలువడటం మొదలైందని చెబుతున్నారు. ఇక దేశీయంగా ఇంధన ధరలు 3 నుంచి 5 శాతం మేర పెరిగితే రిటైల్ ద్రవ్యోల్బణం 0.15-0.25 శాతం మధ్య పెరుగుతుందని కూడా నిపుణులు చెబుతున్నారు.

# క్రెడిట్ కార్డు ఇస్తామని మోసాలు.. సైబర్ నేరగాళ్ల అరెస్ట్

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

క్రెడిట్ కార్డులు ఇప్పిస్తామంటూ అమాయకులను బురిడీ కొట్టించి, లక్షలాది రూపాయల వసూళ్లకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్ల ముఠాను సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు పట్టుకున్నారు. దేశవ్యాప్తంగా పలువురిని మోసం చేస్తూ తప్పించుకు తిరుగుతున్న ఈ ముఠా కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు.. చివరకు భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుల్లో అదుపులోకి తీసుకున్నా రు. ఈ దాడిలో ముఠాకు నాయకత్వం వహిస్తున్న ప్రధాన నిందితుడితో పాటు అతనికి సహకరిస్తున్న మరో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. నిందితులు బ్యాంకు ప్రతినిధులమంటూ బాధితులకు ఫోన్లు చేసి, తక్కువ వడ్డీ రేట్లకు క్రెడిట్ కార్డులను మంజూరు చేయిస్తామని నమ్మించేవారు. వారి మాటలను నిజమని నమ్మి ప్రాసెసింగ్ ఫీజులు, ఇతర ఛార్జీల పేరిట బాధితులు పంపిన డబ్బును తమ ఖాతాల్లోకి మళ్లించుకున్నారు. ఆ తర్వాత ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకుని పరారయ్యేవారు. బాధితుల నుంచి అందిన ఫిర్యాదులతో రంగంలోకి దిగిన సైబరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం.. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితుల ఐపీ అడ్రస్‌లు, మొబైల్ లొకేషన్ల ఆధారంగా వారు బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అక్కడికి చేరుకున్న ప్రత్యేక పోలీసు బృందం నిందితులను అరెస్ట్ చేసింది. ఈ ముఠా వెనుక ఇంకా ఎవరైనా సూత్రధారులు ఉన్నారా, అలాగే ఇప్పటివరకు వీరు ఎంతమందిని మోసం చేశారనే కోణంలో దర్యాప్తు సాగుతోందని సైబరాబాద్ పోలీసులు వెల్లడించారు.

# మంత్రుల జాబితా సిద్ధం చేస్తున్నాం, 18న ప్రమాణ స్వీకారం.. సతీశన్

తిరువనంతపురం:

కేరళంలో యూడీఎఫ్ ప్రభుత్వం కొలువు తీరేందుకు సిద్ధమవుతోంది. మంత్రివర్గం ఏర్పాటుపై భాగస్వామ్య పార్టీలతో చర్చలు జరుగుతున్నాయని, ఈనెల 17వ తేదీ ఆదివారంనాడు మంత్రుల జాబితాను గవర్నర్‌కు అందజేస్తామని ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టనున్నట్టు వీడీ సతీశన్ తెలిపారు. మే 18న తనతో పాటు మంత్రులంతా ప్రమాణస్వీకారం చేస్తారని చెప్పారు.ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ (ఐయూఎంఎల్) నేతలతో శనివారంనాడు సమావేశానంతరం మీడియాతో సతీశన్ మాట్లాడుతూ, రాజకీయ ప్రత్యర్థులు ఎన్ని విమర్శలుచేసినా సెక్యులర్ విధానాన్ని కొనసాగించేందుకు తాము కట్టుబడి ఉన్నట్టు సతీశన్ చెప్పారు. 'కేరళంలో కొన్ని శక్తులు విద్వేష ప్రచారం సాగిస్తున్నాయి.కానీ ముస్లిం లీగ్, వారి నేత పనక్కాడ్ సైయిద్ సాదిఖ్ అలి బలమైన సెక్యులర్ విధానాలకు కట్టుబడి ఉన్నారు. యూడీఎఫ్ కూడా సెక్యులర్ విధానానికి కట్టుబడి ఉంది. ఈ విధానాన్ని కొనసాగిస్తాం' అని వివరించారు.ఎన్నికల ప్రచారంలో ఐయూఎంఎల్‌తో యూడీఎఫ్ పొత్తును బీజేపీ, సీపీఎం లక్ష్యంగా చేసుకుని ఆరోపణలు చేశాయని, కానీ ప్రజలు ఆ ఆరోపణలను తిప్పికొట్టి 102 సీట్లలో తమను గెలిపించారని సతీశన్ చెప్పారు. కాగా, దీనికి ముందు కాంగ్రెస్ సీనియర్ నేత రమేష్ చెన్నితాల నివాసానికి వెళ్లి సతీశన్ కలుసుకున్నారు.



మంత్రివర్గం కూర్పు, శాఖలపై ఆయనతో చర్చించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దశాబ్ద కాలంగా అధికారంలో ఉన్న ఎల్?డీఎఫ్‌పై యూడీఎఫ్ విజయం సాధించింది. 140 స్థానాల్ల 102 సీట్లు గెలుచుకుంది. 2021 నుంచి విపక్ష నేతగా సతీశన్ వ్యవహరిస్తూ ఎల్‌డీఎఫ్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవడంతో ఆయనను సీఎం అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించింది.

న్యూస్ వార్ వార్తా పత్రిక

సంపాదకీయం...

# లక్షల మంది అభ్యర్థులతో చెలగాటం

**లక్షల మంది అభ్యర్థులు పాల్గొన్న నీట్ యుజి2026 పరీక్ష రద్దు కావడం తీవ్ర ఆందోళనలకు దారి తీయడమే కాక, నీట్ విశ్వసనీయతకు భారీ విఘాతం కలిగించింది. పేపర్ లీక్‌తో మే 3న నిర్వహించిన ఈ పరీక్ష రద్దు చేస్తున్నట్టు మే 12న ఎన్‌టిఎ ప్రకటించింది. సాధారణ ప్రవేశ పరీక్షల నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) గతంలో ఎన్నోసార్లు ఇబ్బందులను ఎదుర్కొంది. అయినా గత అనుభవాల నుండి పాఠాలు నేర్చుకున్నట్టు లేదు. తప్పులు ఎక్కడ జరిగాయో సరిదిద్దుకోవడం లేదు. సిబిఐ దర్యాప్తులో ఈ లీకేజీ వ్యవహారం ఎలా చాపకింద నీరులా సాగిందో బయటపడుతోంది. గెస్ పేపర్ లక్షల రూపాయలకు అమ్ముడుపోయింది. రాజస్థాన్ పోలీసులు ఇంతవరకు ఈ గూడుపుఠానీకి సంబంధించి ఐదుగురు మాస్టర్‌మైండ్ వ్యక్తులనే కాకుండా మరో 15 మందిని అరెస్టు చేశారు. ఇంత స్పష్టంగా మోసం జరుగుతుంటే ఇలాంటి మోసాలు మళ్లీ జరగకుండా నివారించాలంటే ఏం చేయాలో ఆలోచించకుండా విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ఎన్‌టిఎపై గల విశ్వాసాన్ని గుర్తించి పరీక్షలు రద్దు చేసినట్టు ఎన్‌టిఎ సమర్థించుకోవడం గమనార్హం.**

అసలు ప్రశ్న ఏమిటంటే ఇప్పటికీ ఎన్‌టిఎ తనపై నమ్మకాన్ని, విశ్వసనీయతను నిలబెట్టుకుందా? ప్రారంభం నుంచీ నీట్ వివాదాలతో సతమతమవుతూ వస్తోంది. నీట్ మెడికల్ పరీక్ష ప్రవేశపెట్టినప్పటి నుంచి తమిళనాడు వంటి రాష్ట్రాలు దీని విధానాన్ని వ్యతిరేకిస్తూనే ఉన్నాయి. అయినా అమలు ఆగలేదు. వివాదాలు తగ్గలేదు. దీంతో నీట్‌పై ప్రజలకు ఉన్న నమ్మకం క్రమేపీ తగ్గిపోతోంది. 2019లో తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిఎన్‌పిఎస్‌సి) గ్రూప్ 1ఙ పరీక్షలో రామేశ్వరం, కిళాకరై కేంద్రాల నుండి పరీక్ష రాసిన దాదాపు 40 మంది అభ్యర్థులు టాప్ 100 ర్యాంకుల్లో నిలిచారు. అయితే ఇందులో జరిగిన మోసాలు బయటపడ్డాయి. పరీక్ష రాసేటప్పుడు సిరా మాయమయ్యేలా ప్రత్యేక పెన్నులు వాడారు. వేరే వ్యక్తులచే పరీక్షలు రాయించి, పరీక్ష పూర్తయిన తరువాత ఆన్సర్ షీట్లు మార్చివేశారు. ఈ మోసాల కోసం అభ్యర్థుల నుండి రూ. 5 లక్షల నుండి రూ. 15 లక్షల వరకు వసూలు చేశారు. ఈ కుంభకోణంలో పాల్గొన్న 99 మంది అభ్యర్థులను జీవితకాలం ప్రభుత్వం నిషేధించింది. అభ్యర్థులు, మధ్యవర్తులు, ప్రభుత్వ ఉద్యోగులతో సహా మొత్తం 118 మంది దోషులను అరెస్టు చేసింది. 2022లో కేరళలోని కొల్లాం జిల్లాలో ఒక ప్రైవేట్ కాలేజీలో నీట్ యుజి పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థినులను తనిఖీ పేరుతో లోదుస్తులను తొలగింప చేయడం విద్యార్థినుల ఆత్మగౌరవాన్ని భంగపరిచే చర్యగా దేశమంతా తీవ్ర ఆందోళనలకు దారి తీసింది. 2024 మే 5న జరిగిన నీట్ పరీక్షకు ముందు రోజు పేపర్ లీక్ అయిందని, బీహార్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో కొందరు పేపర్ అమ్ముకున్నారని ఆరోపణలు వచ్చాయి. ఎన్‌టిఎ పరీక్ష సమయం సరిపోలేదని ఆరోపించిన 1563 మంది విద్యార్థులకు గ్రేస్ మార్కులు (అదనపు మార్కులు) ఇచ్చారు. పేపర్ లీక్, అశాస్త్రీయమైన గ్రేస్ మార్కుల వల్ల 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. దేశవ్యాప్తంగా నిరసనలు చెలరేగడంతో సిబిఐ




దర్యాప్తు చేపట్టింది. ఈ కుంభకోణాల నేపథ్యంలో పరీక్ష వ్యవస్థను పూర్తిగా సంస్కరించడానికి కె. రాధాక్రిష్ణన్ కమిటీ ఎన్‌టిఎను తిరిగి వ్యవస్థీకరించాలని సిఫార్సు చేసింది. పరీక్షల నిర్వహణలో లీకేజీలు, అక్రమాలు జరగకుండా ఉండడానికి ఎన్‌క్రిప్డ్ సాఫ్ట్‌వేర్, ఆన్‌లైన్ పోర్టల్స్, డిజిటల్ లాక్‌లు తదితర ఆధునిక విధానాలు అవలంబించి భద్రత కట్టుదిట్టం చేయాలని కమిటీ సూచించింది. ఈ మేరకు రాష్ట్రాలు, జిల్లాల సమన్వయంతో పటిష్టమైన పరీక్షల వ్యవస్థను రూపొందించాలని సూచించింది. ఇంతేకాకుండా మరికొన్ని సిఫార్సులు వచ్చాయి. పరీక్ష మొత్తం ఒకేసారి కాకుండా దశల వారీగా కంప్యూటర్ ఆధారిత హైబ్రిడ్ విధానం, డిజిటల్ టెక్నాలజీ అనుసరించాలని సూచనలు వచ్చాయి. ప్రశ్నపత్రాలు ఎన్‌క్రిప్టెడ్ రూపంలో కంప్యూటర్ ద్వారా పరీక్ష కేంద్రానికి పంపడం మంచిదని కొందరు సూచించారు. ప్రశ్నపత్రాలు ప్రింటింగ్ విషయంలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. పరీక్ష సమయానికి కొద్ది సేపటి ముందు ఆ కేంద్రంలోనే ప్రశ్నపత్రాలను ప్రింట్ చేస్తారు. దీనివల్ల పేపర్ లీక్ కాదు. కానీ నీట్ నిర్వాహకులకు ఇవేం పట్టడం లేదు. ఎప్పటికప్పుడు పాత పద్ధతుల్లోనే పరీక్షలు నిర్వహించడం, మోసాలకు, కుంభకోణాలకు ఆస్కారం కలిగించడం జరుగుతోంది. ఇంత అసమర్థంగా పరీక్షలు ఎన్‌టిఎ నిర్వహిస్తుండడానికి అనుమతించడం నేరమే అవుతుంది. దీని ప్రభావం కొన్ని లక్షల మంది అభ్యర్థుల భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేస్తోంది. మెడికల్ ఎగ్జామినేషన్‌లో ఏకైక, ప్రామాణిక, పారదర్శక ప్రవేశపరీక్షగా ఉండడానికి నీట్‌ను ప్రవేశపెట్టారు. కానీ ఇప్పటివరకు అది చూపిన పారదర్శకత వాస్తవానికి భిన్నంగా కనిపిస్తోంది. లీకేజీలు, గోప్యత ఉల్లంఘనలు షరా మామూలవుతున్నాయి. పేపర్ లీకేజీ వల్ల పరీక్షలు రద్దు చేశామని ప్రభుత్వం ఎంతనచ్చచెప్పినా అభ్యర్థుల ఆత్మస్థైర్యాన్ని పెంపొందించలేవు. అలాగే రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించకుండా తిరిగి పరీక్షలు రాయవచ్చని అనుమతించినా సంతృప్తి లభించదు. భౌతిక విధానాలతో పరీక్షలు నిర్వహించడం, ప్రశ్నపత్రాలను ప్రింటింగ్ చేయడం, ఆ ప్రెస్‌లనుంచి పరీక్ష కేంద్రాలకు వాహనాల ద్వారా పంపించడం ఇలాంటి భౌతిక విధానాలకు పూర్తిగా స్వస్తి పలికేలా సంస్కరణలు చేపట్టాలి. రాధాక్రిష్ణన్ కమిటీ వంటి కమిటీల సిఫార్సులను తక్షణం అమలు చేస్తే కానీ కుంభకోణాలు అరికట్టవు.

# పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు

## తొలి మూడు ఫలితాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రశంస

## ఒక్కొక్కరికి 5వేల చొప్పున నగదు అందించిన గద్దె దంపతులు

**విజయవాడ,**

:పదో తరగతిలో ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, అనురాధ దంపతులు సత్కరించారు. నలభై మంది విద్యార్థులను సత్కరించి, ఒక్కొక్కరికి 5 వేల రూపాయల చొప్పున రెండు లక్షల రూపాయల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర భవిష్యత్తు, సంపద యువతే అని కూటమి ప్రభుత్వం బలంగా నమ్ముతోందన్నారు. మంత్రి లోకేశ్ తన విద్య అనుభవాన్ని ఉపయోగించి 100 రోజుల కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ మార్కులతో విజయం సాధించారని కొనియాడారు. రౌడీయిజం, మాఫియా, హింస ఉన్న ప్రాంతాలు, దేశాలు సర్వనాశనం అవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. రప్పా రప్పా అంటూ యువత జీవితాలని నాశనం చేసే పార్టీకి శాశ్వతంగా చరమగీతం పాడాలన్నారు. అటువంటి వాతావరణానికి దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గత ఐదేళ్లలో జరిగిన నష్టాన్ని గమనించిన ప్రజలు, తమ పిల్లల భవిష్యత్తు బాగుండాలని కోరుకుంటూ కూటమి అభ్యర్థులకు భారీ మెజారిటీని అందించారన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలన్నది సీఎం చంద్రబాబు సంకల్పమని స్పష్టం చేశారు. రాజధాని అమరావతి నిర్మాణం అనేది కేవలం వ్యక్తి కోసం కాదని.. అది రాబోయే తరాల పిల్లల భవిష్యత్తు కోసమని అందరూ గుర్తుంచుకోవాలని తెలిపారు. యువతకు ఉజ్వల భవిష్యత్తును అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గద్దె రామ్మోహన్ స్పష్టం చేశారు. అమరావతి నగరం ఆంధ్ర




రాష్ట్రం మొత్తానికి ఉపాధి కల్పించే నగరంగా మారబోతోందన్నారు. కూటమి ప్రభుత్వం తన అజెండాలో భాగంగా 20 లక్షల ఉద్యోగాల కల్పనను లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఇప్పటికే అనేకమందికి ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. రాజకీయ సిఫార్సులు, లంచాలకు తావులేకుండా, ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ ఆధారంగానే టీచర్లను ఎంపిక చేస్తున్నారని తెలిపారు. బదిలీల విషయంలో కూడా ఇదే విధమైన పారదర్శక విధానాన్ని ప్రభుత్వం అనుసరిస్తుందని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువును ఎక్కడా ఆపవద్దని... ఫీజుల బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంటుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ వెల్లడించారు. మరి కొంతమందికి స్ఫూర్తిని కలిగిస్తూ దాదాపుగా 40 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే గ్గదె రామ్మోహన్ సత్కారం చేశారని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గ్గదె అనురాధ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఫస్ట్, సెకండ్, థర్డ్ వచ్చిన ప్రతి ఒక్కరితో పాటు, ఉపాధ్యాయుల ను సన్మానించారన్నారు. విద్యకు ఉన్న ప్రాధాన్యం సీఎంకు తెలుసు కాబట్టే డీఎస్సీలో మొట్టమొదటగా 16 వేల మంది టీచర్లను అపాయింట్ చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి సంతకం డీఎస్సీ మీదనే చేశారన్నారు. విద్యలో ఎన్నో సంస్కరణలను మంత్రి లోకేశ్ తీసుకొచ్చారన్నారు. 100 రోజుల ప్రణాళికను ఏర్పాటు చేసి ఉపాధ్యాయులందరినీ ఆ ఎ÷–లాన్‌లోకి తీసుకువెళ్లి మంచి ఉత్తీర్ణత సాధించారని కొనియాడారు. నేడు ప్రభుత్వ బడుల నుంచి వచ్చిన పిల్లలను పేపర్‌లో చూడటం పట్ల రాష్ట్ర ప్రజలందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారని అనురాధ అన్నారు. మరికొంత మంది విద్యార్థులకు, ఎంతో మంది తల్లిదండ్రులకు స్ఫూర్తిని కలిగించే కార్యక్రమం ఇది అని చెప్పుకొచ్చారు. సమిష్టి కృషి, చంద్రబాబు ముందడుగు, లోకేశ్ సంస్కరణలు, ఉపాధ్యాయులు దాన్ని అనుసరించడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు వచ్చాయన్నారు.

# జిల్లాలో అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

## మెరుపు దాడుల్లో భారీమొత్తంలో బియ్యం స్వాధీనం

**అంబేద్కర్ కోనసీమ,**

జిల్లాలో అక్రమ రేషన్ బియ్యం మాఫియాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. జిల్లాలోని అంబాజీపేట, పి.గన్నవరం ప్రాంతాల్లో పోలీసులు ఏకకాలంలో నిర్వహించిన మెరుపు దాడుల్లో భారీ మొత్తంలో అక్రమ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన జిల్లాలో మరోసారి రేషన్ మాఫియా కార్యకలాపాలపై చర్చకు దారితీసింది. పోలీసుల వివరాల ప్రకారం.. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు అంబాజీపేట, పి.గన్నవరం ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో బొలెరో వాహనాల్లో తరలిస్తున్న రెండు వాహనాలను పోలీసులు అడ్డుకుని తనిఖీ చేశారు. అంబాజీపేటలో పట్టుబడిన ఒక బొలెరో వాహనంలో 44 బస్తాల రేషన్ బియ్యం లభించింది. మొత్తం సుమారు 2,200 కిలోల బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ బియ్యం మలికిపురం, రాజోలు ప్రాంతాల నుంచి ఆలమూరు వైపు తరలిస్తున్న సమయంలో పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. ఇక రెండు వాహనాల్లో కలిపి మొత్తం 50 కిలోల చొప్పున 79 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ వ్యవహారంలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు పి.గన్నవరం సీఐ భీమరాజు తెలిపారు. ప్రభుత్వం పేదల కోసం సరఫరా చేసే రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించి లాభాలు ఆర్జిస్తున్న మాఫియాపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. జిల్లాలో ఇటువంటి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అధికారులు తెలిపారు. ఈ ఘటనతో కోనసీమ జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా వ్యవహారం మరోసారి వెలుగులోకి వచ్చింది.

# బాబాయే కీచకుడయ్యాడు

## ఇంటికి చ్చిన బాలికపై పలుమార్లు అత్యాచారం

## కేసు నమోదు చేసిన పోలీసులు..నిందితుడి కోసం గాలింపు

**తిరుపతి,**

కాపాడాల్సిన బాబాయే కీచకుడయ్యాడు. కన్న బిడ్డలా చూసుకోవాల్సిన బాలికపై కామంతో కన్నేశాడు. పర్సనల్ ఫోటోలను అడ్డుపెట్టుకుని.. సోషల్ మీడియాలో షేర్ చేస్తానంటూ బ్లాక్‌మెయిల్ చేసి దారుణానికి ఒడిగట్టాడు. తిరుపతిలో జరిగిన ఈ ఘోరం బాధితురాలి తల్లి ఫిర్యాదుతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్ట పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి.. కేసును తిరుపతి ఈస్ట్ పీఎస్‌కు బదిలీ చేశారు. నిందితుడు రామమూర్తిపై అత్యాచారంతో పాటు ఫోక్సో చట్టం కింద పోలీసులు వేట మొదలు పెట్టారు. సెలవులకని తన ఇంటికి వచ్చిన కూతురు వరుస అయ్యే బాలికపై కన్నేసి కామాంధుడిలా ప్రవర్తించాడు. హైదరాబాద్ కుత్బుల్లాపూర్ పరిధిలోని ప్రాంతానికి చెందిన 16 ఏళ్ల బాలిక ఇంటర్ చదువుతోంది. ఏప్రిల్ నెలలో వేసవి సెలవుల కోసం తిరుపతిలోని తన చిన్నమ్మ ఇంటికి వెళ్ళింది. అక్కడ పిన్ని భర్త రామమూర్తి బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. ఆమె ఫోన్లో ఉన్న కొన్ని వ్యక్తిగత ఫోటోలను చూసిన నిందితుడు.. వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బెదిరించాడు. ఈ ఫోటోలను అడ్డుపెట్టుకుని భయపెడుతూ బాధితురాలిపై రామమూర్తి పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఇంటికి వెళ్ళిపోయినా ఫోటోలతో బ్లాక్‌మెయిల్ చేయడం మానలేదు. పరీక్షలు రాసేందుకు హైదరాబాద్ వచ్చిన బాలిక మానసికంగా కృంగిపోవడాన్ని గమనించిన తల్లి.. నిలదీయగా అసలు విషయం బయటపడింది. బాబాయే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని తెలిసి తల్లి షాక్ తిన్నది. వెంటనే జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు ఘటనా స్థలం తిరుపతి కావడంతో 'జీరో ఎఫ్ఐఆర్' నమోదు చేశారు. అనంతరం కేసును తిరుపతి ఈస్ట్ పీఎస్‌కు బదిలీ చేశారు. తిరుపతి పోలీసులు నిందితుడు రామమూర్తిపై కఠిన సెక్షన్లు నమోదు చేశారు. బాధితురాలి శరీరంపై గాయాలు ఉండటంతో ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉండగా.. పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు.

# దస్తగిరి హత్య కేసులో ఎస్పీ కార్యాలయంలో లొంగిపోయిన నిత్యానందరెడ్డి

**కడప,**

వైసీపీ నేత, కడప మాజీ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి లొంగిపోయారు. వైసీపీ కార్యకర్త పెద్ద దస్తగిరి హత్య కేసులో నిత్యానంద రెడ్డి ప్రధాన నిందితుడిగా ఉన్నారు. గత 20 రోజులుగా వైసీపీ నేత కోసం తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో పోలీసులు గాలిస్తున్నారు. ఎట్టకేలకు సోమవారం ఉదయం ఎస్పీ కార్యాలయంలో పోలీసుల ఎదుట నిత్యానంద రెడ్డి లొంగిపోయారు. కొద్దిరోజుల క్రితం కడపలో వైసీపీ కార్యకర్త పెద్ద దస్తగిరి దారుణ హత్యకు గురయ్యారు.

# తమిళనాడులో విదేశీయుల ఓటు

## ఇమ్మిగ్రేషన్ అధికారుల దర్యాప్తుతో బయటపడ్డ వ్యవహారం

## పదిమందిని అరెస్ట్ చేసిన పోలీసులు

**చెన్నై**

తమిళనాడు ఎన్నికల్లో విదేశీయులు ఓటేసిన వైనం బయటపడింది. ఎన్నికల అధికారుల కళ్లు గప్పి ఓట్లేయడం సంచలనంగా మారింది. ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాత.. విదేశీయులు ఓటింగ్ పాల్గొన్నట్లు వచ్చిన సమాచారంతో దర్యాప్తు జరిపిన ఇమ్మిగ్రేషన్ అధికారులు.. పది మందిని అరెస్టు చేశారు. గత ఎన్నికల్లో ఓట్లేసిన వారిని చెన్నై, మధురై విమానాశ్రయాలలో అరెస్టు చేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో ఎక్కువగా శ్రీలంకకు చెందినవారే ఉన్నారు. విదేశీ వీసా ఉండి కూడా తమిళనాడులో ఎలా ఓట్లు వేశారనేది ప్రశ్నార్థంకంగా మారింది. అరెస్టైన 10 మందిలో.. రంజిని (59), సర్ఫుదీన్ (68), నీలాంతి (44), జయంతన్ (40), చార్లీ బాలచంద్రన్ (48), చక్రవర్తి లోగప్రియ (50), సునీత చక్రవర్తి (48) మొదలైన వారు శ్రీలకం పౌరులు. వీరితో పాటు బ్రిటన్‌కు చెందిన అయ్యదురై (53), ఇండోనేషియాకు చెందిన టిటిన్ మరియాట్టి (47), కెనడాకు చెందిన జితేంద్రనాథ్ (38) అరెస్టైన వారి లిస్టులో ఉన్నారు. చెన్నై, మధురై ఎయిర్ పోర్టులలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇండియా నుంచి విదేశాలకు వెళ్తున్న క్రమంలో.. వారి చూపుడు వేలుకు ఇంకు గుర్తు ఉండటం గమనించారు. విదేశాల వీసా కలిగి ఉండి.. ఇంకు మార్కు గుర్తులు ఉండటమేంటనే అనుమానంతో విచారించారు. దీంతో వాళ్లు మొన్నటి ఎన్నికల్లో ఓటేసినట్లు ఒప్పుకున్నారు. శ్రీలకం వీసాతో వచ్చిన వారికి కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఓటరు గుర్తింపు కార్డులు ఉండటం గమనార్హం. విదేశీయులకు గుర్తింపు కార్డులు ఇవ్వడం చట్టవిరుద్ధంగా నేరమని.. జారీ చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అయితే మొటి అరెస్టు మంగళవారం (మే 12) చేసినట్లు పోలీసులు తెలిపారు. విదేశీయులు ఓటు వేశారనే అంశం ఇప్పుడు తమిళనాడు రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఇప్పటికే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కారణంగా లక్షల ఓట్లు తొలగించారు. అలాంటి పరిస్థితుల్లో మళ్లీ విదేశీ ఓటర్లు ఎలా ఓట్లు వేశారని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం తమిళనాడులో 74 లక్షల పేరర్లను తొలగించారు. దాదాపు 28 క్షల కొత్త ఓటర్లను యాడ్ చేశారు. ఒకవైపు సర్ ప్రక్రియ పూర్తయ్యాక కూడా విదేశీయులు ఎలా ఓట్లేశారని ప్రశ్నిస్తున్నారు. ఓటర్ లిస్టులో పేర్లు ఉంటే.. ఎన్నికల అధికారులు తొలగించలేదా అని ప్రశ్నిస్తున్నారు. అంటే సర్ పక్రియ సరిగ్గా జరగటం లేదా అనే ప్రశ్నలు లేవనెత్తున్నారు.

# గతేడాది కూడా నీట్ ప్రశ్నాపత్రం లీక్

## లీక్ పేపర్లతో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్లు

## టెన్త్. ఇంటర్‌లో అత్తెసరు మార్కులు వచ్చినా నీట్‌లో హవా

## గతేడాది లీక్ ఆనవాళ్లపై దృష్టి సారించిన సిబిఐ

**న్యూఢిల్లీ,**

నీట్ 2026 పరీక్ష పత్రం లీకేజీపై దృష్టిపెట్టిన అధికారులకు గతేడాది లీక్ ఆనవాళ్లు బయట పడుతున్నాయి. కీలక నిందితుడైన వికాస్ బివాల్ గతేడాది యశ్ యాదవ్ నుంచి నీట్ ప్రశ్నపత్రం కొనుగోలు చేసినట్లు సీబీఐ అనుమానిస్తుంది. దీంతో ఈ యేడాది కూడా యశ్ నుంచే వికాస్ ఈ పేపర్‌ను కొన్నాడు. ఈ వ్యవహారంలో యశ్ తండ్రి మంగిలాల్ బివాల్, అంకుల్ దినేశ్ బివాల్ హస్తం కూడా ఉన్నట్లు తెలుస్తోంది. వికాస్ అతడి సోదరిలు ప్రగతి, కజిన్స్ సానియా, గుంజన్, పలాక్‌లు కూడా గతేడాది వైద్యవిద్య సీట్లు పొందారు. వీరంతా కూడా లీకైన పేపర్ సాయంతోనే సీట్లు సాధించినట్లు తెలుస్తోంది. వికాస్‌కు పదో తరగతిలో 63శాతం, 12వ తరగతిలో 55శాతం మార్కులు వచ్చాయి. ఇక 2024లో నీట్ పరీక్ష రాస్తే కేవలం 720కి గాను 240తో సరిపెట్టుకొన్నాడు. సికార్‌లోని ఓ కోచింగ్ సెంటర్‌లో 46 పరీక్షలు రాస్తే సగటున 384 మార్కులు వచ్చాయి. కానీ, 2025లో మాత్రం 85.11 పర్సెంటైల్‌తో గవర్నమెంట్ కాలేజీలో సీటు సాధించడం విశేషం. ఇక ఆయన సోదరి ప్రగతి 10వ తరగతిలో 69శాతం , 12వ తరగతిలో 91శాతం మార్కులు వచ్చాయి. 2024 నీట్‌లో 720కి 355 మార్కులే వచ్చాయి. కానీ, సికార్‌లోని కోచింగ్ సెంటర్‌లో 50 నమూనా పరీక్షలు రాస్తే మార్కులు ఏనాడు 320– 342 దాటలేదు. కానీ, 2025లో హఠాత్తుగా 92.53 పర్సంటైల్‌తో ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది. ఇక మరో కజిన్ సోనియాకు 10వ తరగతిలో 63?, 12వ తరగతిలో 89? మార్కులు వచ్చాయి. 2024 నీట్‌లో 320 మార్కులతో సరిపెట్టుకొంది. సికార్‌లోని కోచింగ్ సెంటర్‌లో 49 మాక్‌టెస్ట్‌లు రాస్తే 341–361 మధ్యే మార్కులు వచ్చాయి. అదే నీట్ పరీక్ష రాస్తే మాత్రం అలవోకగా 94.07 పర్సంటైల్‌తో ప్రభుత్వ కాలేజీలో సీటు పొందింది. ఇక పలాక్‌కు 10వ తరగతిలో 93శాతం, 12వ తరగతిలో 89 శాతంమార్కులు వచ్చాయి. 2024 నీట్‌లో 512 మార్కులు మాత్రమే సాధించింది. సికార్‌లోని కోచింగ్ సెంటర్లలో నిర్వహించిన 50 నమూనా పరీక్షల్లో ఆమెకు ఏనాడు 515–550 మార్కులు దాటలేదు. కానీ, 2025 నీట్‌లో 98.61 పర్సంటైల్‌తో జైపుర్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు సాధించింది. ఇప్పుడు అదే కుటుంబం లోని రిషి కోసం పేపర్ కొనుగోలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అతడు 10వ తరగతిలో 43శాతం, 12వ తరగతిలో గ్రేస్ మార్కులు 50శాతం సాధించాడు.

న్యూస్ వార్
వార్తా పత్రిక

## జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

### కొనుగోలు కేంద్రాల ధాన్యం వెంటనే రైస్ మిల్లులకు బదిలీ చేయాలి ;

నారాయణపేట ,శనివారం జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక దామర గిద్ద మండలం బాపన్ పల్లి ఐకేపీ వరి కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ నిల్వ ఉన్న ధాన్య బస్తాల పరిస్థితిని పరిశీలిస్తూ, కలెక్టర్ వెంటనే ఆ బస్తాలను లారీల్లో లోడ్ చేసి కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. తనిఖీ సమయంలో ఆమె కేంద్రంలో ఇప్పటివరకు ఎంతమంది రైతుల నుంచి ఎన్ని బస్తాల వరి కొనుగోలు చేసినట్లు నమోదు అయ్యిందో, అదే గానే ఎంతమంది రైతులకు ధ్యానం (పేమెంట్) డబ్బులు వారి ఖాతాల్లో జమ అయ్యాయో ఆ సంబందించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ ఔపచారికుల్ని వివరాలు సమర్పించమని, నిల్వ నిర్వహణలో ఏ విధమైన లోపాలు ఉంటే వెంటనే దిద్దుబాటు చేయించాలని అన్నారు.

## తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న “99 రోజుల కార్యాచరణ ప్రణాళిక విజయవంతం;- ఘనంగా విద్యా వారోత్సవాలు

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న “99 రోజుల కార్యాచరణ ప్రణాళిక -- ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక” లో భాగంగా శనివారం నిర్వహించిన 6వ రోజు “కళా వైభవం” కార్యక్రమం బాలకేంద్రం, నారాయణపేటలో ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని విద్యార్థులు చిత్రలేఖనం, హస్తకళలు, సాంస్కృతిక ప్రదర్శనలు మరియు వివిధ కళారూపాలలో అత్యంత ప్రతిభ కనబరిచి అందరినీ ఆకట్టుకున్నారు. పాల్గొన్న ప్రతి విద్యార్థిని జిల్లా విద్యాశాఖ అభినందించింది. వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు మరియు మెమెంటోలు అందజేసి ఘనంగా సత్కరించారు. విద్యార్థులలో సృజనాత్మకత, కళాపట్ల ఆసక్తి మరియు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే దిశగా నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతం కావడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ గోవిందరాజు హర్షం వ్యక్తం చేశారు.

## భువనగిరి లో వేరు వేరు రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

భువనగిరి పట్టణంలోని మద్య పెట్రోల్ బంక్ (గాంధీ పార్క్ సమీపంలో) వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భువనగిరి మండలం కూనూరు గ్రామానికి చెందిన వడి గిరి కురుమ (40) మృతి చెందారు. గిరి ఆటో డ్రైవర్. శనివారం మధ్యాహ్నం ఆటో నడుపుతూ డివైడర్ ను ఢీ కొట్టడంతో గిరి కి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆసుపత్రి కి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అలాగే మూట కొండూరు మండలం ఆరెగూడెం గ్రామానికి చెందిన బరిగెల నర్సింహా అతని భార్య కలిసి టి ఎస్ 05/ ఈ బి 2922 నెంబర్ గల మోటార్ సైకిల్ పై రాయగిరి నుండి భువనగిరి కి వస్తుండగా భువనగిరి శివారులోని మాస్ కుంట వద్ద మట్టి లోడ్ తో ఉన్న టిప్పర్ వాహనం అతి వేగంగా వచ్చి ఢీ కొనడంతో నర్సింహా కు తీవ్ర గాయాలయ్యాయి. నర్సింహా భార్య స్పాట్ లోనే మృతి చెందింది. భువనగిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఎమ్మెల్యే ను మర్యాదపూర్వకంగా కలిసిన భువనగిరి మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ని, ఇటీవల నూతనంగా ఎన్నికైన భువనగిరి మున్సిపల్ కో- ఆప్షన్ నలుగురు సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి ని వారు ఘనంగా సన్మానించారు. భువనగిరి పట్టణంలోని పలు సమస్యల గురించి చర్చించారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్సులో ప్రజలు భువనగిరి నుండి ఉప్పల్ వెళ్ళడానికి చాలా ఇబ్బందులకు గురౌతున్నారని వారన్నారు. ప్రధాన కూడళ్లలో బస్సులు ఆగడం లేదని, అలాగే బస్ షెల్టర్ లు నిర్మించాలని, పురాతనమైన భువనగిరి బస్ స్టేషన్ ను పునః నిర్మాణం చేయాలని ఎమ్మెల్యే ను కోరారు.

## పెట్రోల్, డీజిల్ రేట్ల పెంపు సామాన్యుల పాలిట పిడుగుపాటు

### మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి

సామాన్యుల పాలిట పిడుగుపాటు అంటూ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి తీవ్రంగా మండిపడ్డారు. ఇరాన్ – ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపి పెట్రోల్, డీజిల్ రేట్లను అడ్డగోలుగా పెంచడం సామాన్యుల నడ్డి విరచడమే అంటూ విరుచుకుపడ్డారు. శనివారం నంగునూర్ లో విలేకరుల తో మాట్లాడారు. ఆత్మనిర్భర్ కేవలం ఓట్లు రాల్చే నినాదమే తప్ప ఫలితాలు తెచ్చిన పాలసీ కాదన్నది తేలిపోయిందని చైర్మన్ అన్నారు. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై తీవ్రంగా మండిపడ్డారు. నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న పెట్రోల్, డీజిల్ ధరల పెంపు నిర్ణయం ఏ మాత్రం సమర్థనీయం కాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం అనేక రంగాలపై వ్యతిరేక ప్రభావం చూపుతుందని తెలిపారు. నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యుల పాలిట పిడుగుపాటు అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వ అసమర్థ పాలన, అనాలోచిత విధానాల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైందని విమర్శించారు. తప్పుడు నిర్ణయల మూలంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతిన్నాయని... యువత ఉపాధికి గ్యారెంటీ లేని పరిస్థితి దాపురించిందని వ్యాఖ్యానించారు. రైతుల ఆదాయాలు రెట్టింపు చేస్తామన్న హామీ ఒట్టి మాటగా మిగిలిందన్నారు. గత పదేళ్లుగా రూపాయి విలువ పతనమవుతూ వస్తోందని... ఇప్పుడు ఆ పతనం పరాకాష్ఠకు చేరిందని అన్నారు. ఈ పరిస్థితుల్లో ఇరాన్ – ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపి పెట్రోల్, డీజిల్ రేట్లను పెంచడం సామాన్యుల నడ్డి విరచడమే అంటూ విరుచుకుపడ్డారు. ప్రపంచంలో భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపామని ఘనంగా ప్రకటించుకుంటున్న మోదీ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఎలా సమర్థించుకుంటుందని ప్రశ్నించారు. ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంత ఎన్నికలకు ముందు మోదీ ప్రభుత్వం ‘పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచం’ అని పదే పదే ప్రకటించిందని గుర్తుచేశారు.

# పెట్రోల్, డీజిల్ చార్జీలు తగ్గించాలని సిపిఐ ఆధ్వర్యంలో నిరసన

నిజామాబాద్ మే 16 (న్యూస్ వార్)





కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ చార్జీలు తగ్గించాలని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుండి టూరిజం హోటల్ బస్టాండ్ మీదుగా రైల్వే స్టేషన్ వరకు ఆటోను లాగుతూ నిరసన ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.ఓమయ్య మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ఇరాన్ అమెరికా ఇజ్రాయిల్ యుద్ధం జరిగినా కూడ భారతదేశానికి ఎటువంటి నష్టం వాటిల్లదని ఆరు నెలల పైచిలుకు పెట్రోల్ డీజిల్ నిల్వలు ఉన్నాయని ప్రజలు ఆందోళన పడాల్సిన అవసరం లేదని మాయ మాటలు చెప్పి ఈరోజు కొంతమంది బడా వ్యాపారస్తులకు లాభాలు చేకూర్చడానికి భారతదేశంలో పెట్రోల్ డీజిల్ నిల్వలను తక్కువ చూపిస్తూ నిస్సిగ్గుగా రేట్లు పెంచటానికి పూను కోవటం దుర్మార్గామని అన్నారు. ప్రజలకు పొదుపు మాటలు చెప్పే మోడీ ఆయన మాత్రం తాను తినే తిండికి కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నాడని వేసుకునే బట్టలకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ ప్రజలకు మాయమాటలు చెబుతూ మోసం చేయడం మానుకోవాలని హితవు పలికారు. నిజంగా మోడీకి ప్రజలపై ప్రేమ ఉంటే ప్రజా సంక్షేమమే ఆయన ఉద్దేశం అయితే నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని. పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ ధరలను తగ్గించాలని. ఆయన తిండి ఖర్చులు బట్టలు ఖర్చులు మెయిన్టెనెన్స్ తగ్గించి దేశ ప్రజలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఇప్పటికైనా పెంచిన చార్జీలు తగ్గించకుంటే సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన ఉద్భృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు బి అనిల్, పిన్నెల హనుమాన్లు, సురేష్, ఫిరోజ్, గోవర్ధన్ ,రంజిత్, ప్రసాద్ భానుచందర్ ,మహేష్ ,సలీం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండ జిల్లాలో ముమ్మరంగా టీయూడబ్ల్యూజే ( ఐ జె యు) సభ్యత్వ నమోదు

### జర్నలిస్టుల హక్కుల సాధన కోసం నిరంతరం కృషి

### టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి

నల్లగొండ, మే 16 :



నల్లగొండ జిల్లాలో టి యు డబ్ల్యు జె( ఐ జే యు ) సభ్యత్వ నమోదు ముమ్మరంగా కొనసాగుతుంది. జిల్లాలోని అన్ని మండలాలలో, పట్టణాలలో, నియోజకవర్గ కేంద్రాలు, జిల్లా కేంద్రంలో సభ్యత్వ నమోదును ప్రారంభించారు. అన్ని ప్రధాన పత్రికలతో పాటు, ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియా, చిన్న పత్రికల ఎడిటర్లు, రిపోర్టర్లు, ఫోటో జర్నలిస్టులు వీడియో జర్నలిస్టులు పెద్ద ఎత్తున సభ్యత్వాలను పొందుతున్నారు. ఈ సందర్భంగా నల్లగొండలో శనివారం సాయంత్రం జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో టియుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో జర్నలిస్టుల హక్కులను కాపాడుకోవడంతోపాటు, ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం, ఇంటి నిర్మాణం, హెల్త్ కార్డుల వంటి సౌకర్యాలను కల్పించడం కోసం టి యుడబ్ల్యూజే కృషి చేస్తుందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రం తో పాటు, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా యూనియన్ నిరంతరం జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందని తెలిపారు. ప్రతి జర్నలిస్టు కు యూనియన్ అండగా నిలుస్తుందని, అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ అందించటానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘము బాధ్యులు అబ్బోజు మదనా చారి, పులిమామిడి మహేందర్ రెడ్డి , పిట్టల రామకృష్ణ, దోటి శ్రీనివాస్, పొట్టు ముత్తు అశోక్, కే.జగదీశ్వర చారి, కత్తుల యాదగిరి, మహమ్మద్ గౌస్ ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# అల్లందేవిచెరువు పల్లె దవాఖానకు వైద్యుడిని నియమించండి

సంస్థాన్ నారాయణపురం మే 16 (న్యూస్ వార్)

అల్లందేవిచెరువు గ్రామ పల్లె దవాఖానలో వైద్య సేవలు సక్రమంగా అందించేందుకు వైద్యుడిని నియమించాలని మండల వైద్యాధికారి రవీనాకు వినతిపత్రం అందచేసినట్లు గ్రామ సర్పంచ్ సుర్వి సౌజన్య రాజు గౌడ్ విడుదల చేసిన పత్రికా ప్రకటనలో. గ్రామ ప్రజలు ప్రస్తుతం వైద్య సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని,ముఖ్యంగా వృద్ధులు,గర్భిణీలు మరియు చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని. గ్రామానికి క్రమం తప్పకుండా వైద్య సేవలు అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరామని. దినికి మండల వైద్యాధికారి రవీనా సానుకూలంగా స్పందించి, పై అధికారులతో మాట్లాడి అల్లందేవిచెరువు గ్రామానికి వారానికి కనీసం రెండుసార్లు వైద్యుడిని పంపించి గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఆమె తెలిపారు



Edited, Printed, Published & Owned by NATAVA KRISHNA RAO, Published from: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255, Telangana, Printed at: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255,Telangana, Editor:NATAVA KRISHNA RAO, Cell: 9440991979,